సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 23 । మార్చి । 2023



సీతారాముల కల్యాణ రాట

అంజికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో సీతారామచంద్రస్వామి పెళ్లి రాట వేడుకగా ఘనంగా జరిగింది. 8లో



11 సెంట్రల్ బ్యాంక్ బ్రాంచ్‌లు

11 సెంట్రల్ బ్యాంకు బ్రాంచ్‌లు ప్రారంభించనున్నట్లు డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత వెల్లడించారు. 8లో



'సాహిత్య మక్కువ'

గణిత ఉపాధ్యాయుడు జుంజూరి అమృత రావు సాహిత్యంపై మక్కువతో రచనలు చేస్తూ పురస్కారాలు పొందుతున్నారు. 8లో

న్యూస్‌రీల్

ఘనంగా మోదమ్మ ఉత్సవాలు



చందాల వసూళ్ల పుస్తకాలకు పూజలు నిర్వహిస్తున్న నర్సింగరావు తదితరులు

సాక్షి,పాడేరు: పాడేరు మోదకొండమ్మతల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు భక్తులు సహకరించాలని ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు కోరారు. మోదమ్మ ఉత్సవ చందాల వసూళ్లకు సంభంధించి రసీదు పుస్తకాలను మోదమ్మ ఆలయంలో అమ్మవారి పాదాల వద్ద ఉంచి ఆయనతోపాటు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వర్తన పిన్నయ్యదొర,ఉపాధ్యక్షులు కొట్టగుళ్లి సుబ్బారావు,పాడేరు ఉప సర్పంచ్ బూరెడ్డి రామునాయుడు,ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కొండబాబు పూజలు జరిపారు. మాజీ ఎంపీపీ వర్తన ముత్యాలమ్మ,ఆలయ,ఉత్సవ కమిటీ ప్రతినిధులు,దేశిది బాబూరావు, ధర్మారావు, కొట్టగుళ్లి రామారావు, కొట్టగుళ్లి నాగేంద్ర, అల్లాడ నగేష్, సోమరాజు పాల్గొన్నారు.

27న వాహనాలకు వేలం

అరకులోయ రూరల్: వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 27న బహిరంగా వేలం పాట నిర్వహిస్తున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో గణపతిబాబు తెలిపారు. ఆసక్తిగల వారు ఉదయం 10.30జరిగే వేలంలో పాల్గొనాలని కోరారు. వివరాలకు 9440902393,7981049077 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

3 నుంచి జిల్లాస్థాయి క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్

హుకుంపేట: మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా హుకుంపేటలో వచ్చే నెల 3వ తేదీ నుంచి జిల్లా స్థాయి మెగా క్రికెట్, వాలీబాల్ టోర్నమెట్ నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ చైర్మన్ నైని సత్తిబాబు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే జట్లు ఈ నెల 23 నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. వాలీబాల్, క్రికెట్ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి 25 వేలు, ప్రైజ్ మనీ మరియు ట్రోఫీ బహుమానంగా అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎంట్రీ పీజు రూ.2 వేలు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. వివరాలకు 9441122779, 8688067322లో సంప్రదించాలని ఆయన కోరారు.

దూసుకెళ్లిన కారు



తుప్పల్లోకి దూసుకెళ్లిన కారు

రాజవొమ్మంగి: మండలంలోని సంజీవనగరం నుంచి రాజవొమ్మంగి వస్తున్న కారుకు బుధవారం పంక్చర్ కావడంతో చెరకుంపాలెం సమీపంలో ప్రమాదానికి గురైంది.కారు యజమాని రాజు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అదుపుతప్పి రోడ్డుపక్కకు దూసుకుపోయింది. చెట్టును ఢీకొట్టడంతో ముందు భాగం నుజ్జయింది.

ఉత్తమ రైతు రఘుకు ఉగాది పురస్కారం



గుంటూరులో వీసీ నుంచి అవార్డు అందుకుంటున్న రైతు రఘు

బుచ్చెయ్యపేట : మండలంలోని బంగారు మెట్టకు చెందిన రైతు సాయం రఘు రాష్ట్ర ఉత్తమ రైతుగా ఉగాది పురస్కారం దక్కించుకున్నారు. బుధవారం ఉగాది పర్వదినాన ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం గుంటూరులో జరిగిన వేడుకల్లో వైస్ చాన్సలర్ విష్ణువర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా రఘు ఈ అవార్డును అందుకున్నారు. వ్యవసాయంలో ఆధునిక మెలకువలు పాటించి, సమగ్ర సస్య రక్షణ చేస్తూ, శాస్త్రీయ పద్ధతుల్లో అధిక పంట దిగుబడులు సాధించడంతో రఘును రాష్ట్ర ఉత్తమ రైతుగా ఎంపిక చేశారు. అవార్డు అందుకున్న రఘును మండల నాయకులు, వ్యవసాయశాఖ అధికారులు అభినందించారు.

జీ-20 సమ్మిట్..

విశాఖకే తలమానికం

మేయర్ గొలగాని హరి వెంకట కుమారి 8లో

చింతూరు ఏరియా ఆస్పత్రికి మంచి రోజులు



చింతూరు ఏరియా ఆస్పత్రిలో రోగులు

- మెరుగుపడిన సౌకర్యాలు
- పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు
- దృష్టి సారించిన కలెక్టర్ సుమిత్‌కుమార్

చింతూరు: మన్యంలో వైద్యసేవలు మరింత మెరుగుకు చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ చొరవతో స్థానిక ఏరియా ఆస్పత్రిలో మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. గతనెలలో కలెక్టర్ సుమిత్‌కుమార్ చింతూరు పర్యటనలో భాగంగా ఏరియా ఆస్పత్రి సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలు, సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న రక్తపరీక్షలతో పాటు ఇతర వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించేందుకు పరికరాలు, కెమికల్స్ అందుబాటులోకి తేవాలని ఇక్కడి వైద్యులు కలెక్టర్‌ను కోరారు. వెంటనే అందుకు తగ్గట్టుగా ఆయన చర్యలు చేపట్టడంతో మరిన్ని పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే చింతూరు ఏరియా ఆసుపత్రిలో జ్వరాలకు సంబంధించి మలేరియా బ్లడ్ స్మియర్, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ ర్యాపిడ్ టెస్ట్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు మూత్ర సంబంధ పరీక్షలు, వైరస్‌కు సంబంధించిన పరీక్షలు, టీబీ సంబంధిత పరీక్షలు, ఈఎస్‌ఆర్, సీటీ టెస్ట్, బీటీ టెస్ట్ కూడా అందుబాటులో ఉన్నాయి.

వైద్య పరీక్షలివే..

కలెక్టర్ చొరవతో బయో కెమికల్ అన్‌లైజర్ పరికరం సమకూరింది. దీనిద్వారా బ్లడ్ షుగర్ టెస్ట్, రీనల్ ఫంక్షన్ టెస్ట్, లివర్ ఫంక్షన్ టెస్ట్, లిపిడ్ ప్రొఫైల్ టెస్ట్‌లు కొత్తగా అందుబాటులోకి వచ్చాయి. దీంతోపాటు సెల్‌కౌంటర్ పరికరం



బయోకెమికల్ అనలైజర్ పరికరం

ద్వారా సీబీపీ, డబ్ల్యుబీసీ, ఆర్‌బీసీ, హెచ్‌బీ పర్సంట్, ప్లేట్‌లెట్ కౌంట్ టెస్ట్‌లు, ఎలక్ట్రోలైట్స్ సంబంధిత పరీక్షలు కూడా అందుబాటులోకి వచ్చాయి.

పెద్దదిక్కులా..

చింతూరు డివిజన్‌లో చింతూరు ఏరియా ఆస్పత్రి, కూనవరం సీహెచ్‌సీతో పాటు తొమ్మిది పీహెచ్‌సీలు, నాలుగు సబ్‌సెంటర్లు ఉన్నాయి. చింతూరు, కూనవరం, ఎటపాక, వీఆర్‌పురం మండలాలకు చెందిన రోగులకు చింతూరులోని ఏరియా ఆస్పత్రి ఎంతగానో ఉపయోగపడుతోంది. కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం కూడా అందుబాటులో ఉంది. ఏరియా ఆస్పత్రిలో కొత్తగా రక్తపరీక్షల ఏర్పాటు ద్వారా నాలుగు మండలాల ప్రజలకు వైద్యసేవలు మరింత అందుబాటులోకి వచ్చినట్లయింది.

కలెక్టర్ సహకారంతో సాధ్యం

> ఏరియా ఆసుపత్రిలో కొత్తగా అందుబాటులోకి వచ్చిన పరీక్షలను నాలుగు మండలాల ప్రజలు ఉపయోగించుకోవాలి. మన్యంలో వైద్యసేవలు మెరుగు పరచడంలో భాగంగా ఆసుపత్రి అభివృద్ధితోపాటు అన్నిరకాల సౌకర్యాలు అందుబాటులో ఉండేలా కలెక్టర్ సుమిత్‌కుమార్ సహకారం అందిస్తున్నారు.
>
> – డాక్టర్ కోటిరెడ్డి, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, చింతూరు

నిర్వాసితులందరికీ పరిహారం

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



చింతూరు: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో నిర్వాసితులవుతున్న ప్రజలందరికీ ఎలాంటి అన్యాయం జరగకుండా పరిహారం చెల్లిస్తామని, ఈ విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో ఉందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో 41.15 కాంటూరులో ఉన్న 21 గ్రామాలకు పరిహారం, పునరావాసం కల్పించే కార్యక్రమం పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ గ్రామాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిహారం అందించడంతో పాటు పునరావాస కాలనీలు యుద్ధప్రాతిపదికన నిర్మించినట్లు ఆమె తెలిపారు. గత వరదల్లో ప్రజల ఇబ్బందులను గమనించి 45.72 కాంటూరులో ఉన్న 17 గ్రామాలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి 41.15 కాంటూరులో అదనంగా కలిపి పరిహారం చెల్లించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం ఆ 17 గ్రామాలకు కూడా తొలిదశలో ఆర్ అండ్‌ఆర్ చెల్లిస్తామని, ఆయా గ్రామాల్లో ఈనెల 21 నుంచి వచ్చేనెల 2 వరకు గ్రామసభలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. సామాజిక ఆర్థికసర్వే ఆధారంగా 17 గ్రామాల్లో ఎన్ని కుటుంబాలున్నాయనే వివరాలతో పాటు కొత్తగా చేర్చాల్సిన కుటుంబాలను చేర్చేలా చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. ప్రతి నిర్వాసితుడికి పరిహారం చెల్లింపులో ఎలాంటి అన్యాయం జరగకుండా ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎమ్మెల్యే తెలిపారు.

మోదమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు

సాక్షి,పాడేరు: ఉగాది పండగను జిల్లాలో అన్ని వర్గాల భక్తులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రమైన పాడేరులోని అన్ని ఆలయాల్లోను భక్తుల తాకిడి నెలకొంది. ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయానికి వేకువజామునుంచే భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యం మోదమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. ఎస్పీ సతీష్‌కుమార్,ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు,ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు.



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

సాయంత్రం నుంచి భక్తులు తాకిడి అధికమైంది. మాజీ మంత్రి మణికుమారి సమకూర్చిన పులిహోర, ఇతర ప్రసాదాలను పంపిణీ చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

కారు ఢీకొని ఒకరు, ఆటో బోల్తా పడి మరొకరు మృతి



నవీన్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

రంపచోడవరం: వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మంగళవారం రాత్రి ఇద్దరు గిరిజనులు మృతి చెందారు. మోటార్ బైక్‌ను కారు ఢీకొట్టిన సంఘటనలో మారేడుమిల్లి మండలం మల్లవరం గ్రామానికి చెందిన కత్తుల నవీన్‌కుమార్‌రెడ్డి(22) అక్కడిక్కడే మృతి చెందాడు. మల్లవరం గ్రామం నుంచి బంధువులతో కలిసి మోటార్ బైక్ సీతపల్లి జాతరకు వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. నవీన్‌కుమార్‌రెడ్డి, బంధువులు కత్తుల రామిరెడ్డి, పండమ్మ బైక్‌పై వస్తుండగా ఐ.పోలవరం జంక్షన్ దాటిన తరువాత పాలకాలువ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారు,బైక్ ఢీకొన్నాయి. నవీన్‌కుమార్‌రెడ్డి సంఘటన స్థలంలో మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్‌లో రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపారు.



ప్రమాదానికి కారణమైన కారు

ఆటో బోల్తాపడిన ఘటనలో..

ఆటో బోల్తా పడిన సంఘటనలో రంపచోడవరం మండలం నరసాపురం గ్రామానికి చెందిన చింతడ శ్రీను (50) మృతి చెందాడు. నరసాపురం గ్రామం నుంచి భార్య కన్నయమ్మ, మనుమరాలు చైతన్యతో కలిసి సీతపల్లి జాతరకు బయలుదేరారు. ఈతలపాడు వద్దకు వచ్చిన తరువాత రోడ్డుకు అడ్డంగా ఉన్న ఆవులను ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. దీంతో గాయాలు పాలైన శ్రీనును రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ వివరించారు.

కడుపునొప్పితో ఆశ్రమ విద్యార్థి మృతి

ముంచంగిపుట్టు: కడుపు నొప్పితో బాధపడుతున్న ఆశ్రమ విద్యార్థి చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల–2లో 5వ తరగతి చదువుతున్న కొర్రా కిరణ్(10)కు గత కొద్ది రోజులుగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. మంగళవారం రాత్రి కడుపు నొప్పి ఎక్కువ అవ్వడంతో వార్డెన్ స్థానిక సీహెచ్‌సీకి హుటాహుటిన తరలించారు. స్థానిక వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించారు. విద్యార్థి పరిస్థితి విషమంగా ఉండడంతో ఇక్కడి నుంచి పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో విద్యార్థి కిరణ్ మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని స్వగ్రామం బాబుశాల పంచాయతీ బల్లుగూడకు తరలించారు. కుమారుడి మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌ఎఫ్ఐ, గిరిజన సంఘం నేతలు నరసయ్య, ఎంఎం శ్రీను, భీమరాజు, గాసిరాందొర బల్లుగూడ వెళ్లారు. విద్యార్థి మృతదేహాన్ని పరిశీలించారు. తల్లిదండ్రులను ఓదార్చారు.



విద్యార్థి కిరణ్ మృతదేహం



విద్యార్థి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నేతలు

బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఆశ్రమ పాఠశాలలో హెల్త్ వలంటీర్‌గా నియమించాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాల అధికారులు నిర్లక్ష్యంవల్లే విద్యార్థి కిరణ్ మృతి చెందడాని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు.



పాడేరులో దట్టంగా మంచు

భిన్న వాతావరణం

సాక్షి,పాడేరు: జిల్లాలో భిన్న వాతావరణం నెలకొంది.బుధవారం కూడా ఉదయం 8గంటల వరకు పొగమంచు దట్టంగా కురిసింది.తరువాత మంచుతెరలు వీడి సూర్యోదయం అయినప్పటికి మధ్యాహ్నం నుంచి మబ్బు వాతావరణం నెలకొంది.సాయంత్రం వర్షం కురిసింది. పాడేరుతో పాటు పలు మండలాల్లో రెండు రోజుల నుంచి ఇదే పరిస్థితి.



పాడేరులో సాయంత్రం కురుస్తున్న వర్షం

గ్రామసభలు సద్వినియోగం

భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరద సుబ్బారావు

కూనవరం: పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ముంపు నిర్వాసితులు ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరద సుబ్బారావు అన్నారు. మండలంలో కాంటూరుతో సంబంధం లేకుండా తరచూ వరద ముంపునకు గురవుతున్న ఏడు గ్రామాల్లో, వీఆర్‌పురం మండలంలో తొమ్మిది గ్రామాల్లో మంగళవారం ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభలకు స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ వరద సుబ్బారావు, వీఆర్‌పురం ఎస్‌డీసీ లక్ష్మీపతి శ్రీకారం చుట్టారు. వీఆర్‌పురం మండలం రామవరం ప్పాడు గ్రామంలో, చినార్కూరు పంచాయతీ పంద్రాజుపల్లిలో సర్పంచ్ సున్నం అభిరామ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ సామాజిక ఆర్థిక కుటుంబాల గణనం, గిరిజన నిర్వాసితులు కోరుకున్న చోట పునరావాసం కల్పించడం, భూమికి భూమి చూపించడం గ్రామ సభల ఉద్దేశం అన్నారు. ఇందులో మధ్యవర్తుల ప్రమేయం ఉండరాదని, నిర్వాసితులు నేరుగా వారి సమస్యలు సందేహాలు స్థానిక తహసీల్దార్, ప్రజాప్రతినిధుల ద్వారా తమ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. కాగా పంద్రాజుపల్లి గ్రామంలో 30 కుటుంబాలనే ముంపులో చూపారని మిగిలిన 85 కుటుంబాలను మొదటి ప్రాధాన్యతలో చేర్చాలని ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ అధికారులను కోరారు. గ్రామ సభలో తీర్మానం చేసి తహసీల్దార్ ద్వారా తెలియజేయాలని ఎస్‌డీసీ కోరారు. ఈ సమావేశంలో రెండవ ఎస్‌డీసీ వీవీ రమణ, తహసీల్దార్ కె.అనసూయ, వీఆర్‌పురం తహసీల్దార్ శ్రీధర్, కార్యదర్శి శివమణికంఠ, వీఆర్వో ధర్మరాజు పాల్గొన్నారు.



పంద్రాజుపల్లి సభలో మాట్లాడుతున్న వరద సుబ్బారావు

మసీదు పున:ప్రారంభం

- రేపటి నుంచి రంజాన్ ఉపవాసాలు
- ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు



మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రమైన పాడేరులో తొలి పురాతన మసీదును ముస్లిం కుటుంబాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశాయి. సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చుపెట్టి మసీదుకు భవనాలతో పాటు పలు సౌకర్యాలను అందుబాటులో తెచ్చారు. సర్వాంగ సుందరంగా నిర్మించిన మసీదును బుధవారం రాత్రి పున:ప్రారంభించారు. మత గురువు మొహమ్మద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ మాసం గురువారం నుంచి ప్రారంభం కావడంతో మసీదును ముస్తాబు చేశారు. రంజాన్ మాసంలో ప్రత్యేక ప్రార్థనలు, ఇఫ్తార్ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు మసీదు అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్.కె.అబ్దుల్లా, ఇక్బాల్, సులెమాన్, మస్తాన్, షమీమ్, కాశింవల్లీ, ఖాధర్, అన్సారీ, రఫీఖాన్ తదితరులు తెలిపారు.



పాడేరులో విద్యుత్ అలంకరణలో మసీదు

'శోభకృత్'లో అన్నీ మంచి ఫలితాలే



శివాలయంలో పంచాంగ శ్రవణం

సాక్షి,పాడేరు: శోభకృత్ నామ సంవత్సరంలో అన్ని వర్గాలకు మంచి ఫలితాలే ఉంటాయని అర్చకులు రామం, సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఆధ్మాత్మిక సేవా కార్యక్రమాలతో పాటు, పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించారు.

పలువురికి సత్కారం: పాడేరులోని మోదకొండమ్మ,ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయాల్లో ఆధ్మాత్మిక సేవకులకు ఉగాది పురస్కారాలు అందించారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు, ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు తదితరులు వారిని సత్కరించారు. జ్ఞాపికలు అందజేశారు. పాడేరులోని అర్చకులకు వాసవీ క్లబ్ హిల్స్ ప్రతినిధులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఆంజనేయస్వామి ఆలయంలో గత 40 ఏళ్లుగా అర్చకులుగా విశేష సేవలందించడంతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో విశిష్ట పేరున్న ప్రభాకర్‌శర్మను శాలువా కప్పి సత్కరించారు. జ్ఞాపికను అందజేశారు. సాయిబాబా ఆలయంలో అర్చకులు కొండబాబుశర్మ,శివాలయంలో అర్చకులు రామంపంతులు,మోదకొండమ్మతల్లి ఆలయంలో ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం,కనకదుర్గమ్మతల్లి ఆలయంలో అర్చకులు ప్రసాద్,వాసవీమాత ఆలయంలోని ప్రవీణ్‌లలను సత్కరించారు.పంచాంగ శ్రవణం జరిపించారు. ఈ కార్యక్రమంలో వాసవీ హిల్స్ క్లబ్ ఉమ్మడి విశాఖ జిల్లా ప్రతినిధి శ్రీనాథు శ్రీను, పాడేరు శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సంతోష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సేవకులను సత్కరిస్తున్న డాక్టర్ నర్సింగరావు

వైభవంగా అప్పన్న పెళ్లిరాట మహోత్సవం



వెంకన్న, శ్రీదేవి, భూదేవి, గోదాదేవి అలంకరణలో కళాకారులు

సింహాచలం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి పెళ్లిరాట(ఉడుపు రాట) ఉత్సవం బుధవారం ఘనంగా జరిగింది. అశేషంగా తరలివచ్చిన భక్తజన సందోహం మధ్య సాయంత్రం 4.30 గంటల నుంచి ఈ ఉత్సవాన్ని సింహాచల దేవస్థానం వైదిక, అధికార వర్గాలు నిర్వహించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని పెళ్లికుమారుడుగా అలంకరించి శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో సహా ఆలయ ఆస్థాన మండపంలో వేంజేపచేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, షోడషోపచార పూజలు నిర్వహించారు. తొలుత పంచాంగ శ్రవణాన్ని దేవస్థానం పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఘనంగా నిర్వహించారు. తదుపరి మహిళలు పసుపుకుంకుమలతో పెళ్లిరాటలను తీర్చిదిద్దారు. అనంతరం ఆలయ ఉత్తరద్వారం వద్ద, రాజగోపురం వద్ద, వార్షిక కల్యాణోత్సవం జరిగే నృసింహ మండపంలోను పెళ్లిరాటలను వేశారు. ఏప్రిల్ 2న వార్షిక కల్యాణోత్సవం జరగనుంది. దేవస్థానం పూర్వ అనువంశిక ధర్మకర్త పూసపాటి సుధాగజపతిరాజు, దేవస్థానం డిప్యూటీ ఈవో సుజాత, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీను బాబు, వారణాసి దినేష్‌రాజ్, సంపంగి శ్రీనివాస రావు, పిల్లా కృష్ణమూర్తిపాత్రుడు, సువ్వాడ శ్రీదేవి ఈఈ శ్రీనివాసరాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెళ్లిరాటని పురస్కరించుకుని వెంకటేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవి, గోదాదేవి అలంకరణలో కళాకారులు కనువిందు చేశారు. అలాగే ఆలయ రాజగోపురం వద్ద జరిగిన కోలాటం ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

అప్పన్న ఆదాయం 14, వ్యయం11

శ్రీ శోభకృత్‌నామ సంవత్సరంలో శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామివారి ఆదాయం 14, వ్యయం 11గా పంచాంగం ప్రకారం పురోహిత్ అలంకారి కరి సీతా రామాచార్యులు పేర్కొన్నారు. స్వాతి నక్షత్రం, తులారాశి వాడైన శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామివారికి శుభకృత్‌నామ సంవత్సరంలో వ్యయం కన్నా ఆదాయం మెరుగ్గా ఉందని అభివర్ణించారు. ఏటా ఉగాది రోజు సాయంత్రం స్వామివారి మూల విరాట్‌పై సూర్యకిరణాలు పడుతుంటాయి. ఈ ఏడాది కూడా మబ్బులు, వర్షపు జల్లులు కారణంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిపై సూర్యకిరణాలు పడే దృశ్యాన్ని తిలకించే భాగ్యానికి భక్తులు నోచుకోలేదు.



రాజగోపురం వద్ద పెళ్లిరాట వేస్తున్న భక్తులు, అధికారులు, అర్చకులు

క్లుప్తంగా

సీతారాముల కల్యాణ రాట

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం సీతారామచంద్రస్వామి పెళ్లి రాట వేడుకగా సాగింది. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఉదయం కల్యాణ రాట వేసి, స్వామిని పెండ్లి కుమారుని చేశారు. అనంతరం విశేష ఆరాధన, పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ నెల 30న శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్త అనురాధ, పులి రామారావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యో...పా(ప)ము



తాడుతో కట్టిన పాము

నర్సీపట్నం: పట్టణంలో ఆర్డీవో కార్యాలయం బయట మెయిన్ రోడ్డును ఆనుకొని ఉన్న ఇనుప కంచెకు ప్రాణంతో ఉన్న పామును తాడుతో గుర్తు తెలియని వ్యక్తులు బంధించారు. సుమారు నాలుగు అడుగుల పొడవు, బలమైన పొడపామును ఎవరో తీసుకువచ్చి ప్లాస్టిక్ తాడుతో పాము మెడను బంధించి కంచికి కట్టేసి వదిలేశారు. తాడుతో కట్టేయడంతో పాము బందీ అయింది. మెయిన్ రోడ్డు పక్కన ప్రాణంతో కొట్టుమిట్టాడుతున్న పామును ప్రజలు ఆసక్తి చూశారు. పాము బతికి ఉండగానే నరకం చూసింది.

జీ-20 సమ్మిట్.. విశాఖకే తలమానికం



- సదస్సులో ప్రజలు భాగస్వాములు కావాలి
- నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలి
- సుందరీకరణ పనులు 90 శాతం పూర్తయ్యాయి
- 'సాక్షి'తో మేయర్ గొలగాని హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్ (విశాఖ): విశాఖ నగరంలో జీ-20 సదస్సు నిర్వహించడం గర్వకారణంగా భావిస్తున్నట్టు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. జీ-20 సమ్మిట్ ఏర్పాట్లు, అతిథులు, పర్యాటకులకు కల్పించిన సౌకర్యాలపై బుధవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. 'విశాఖ కీర్తిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఇక్కడి ప్రజలు తరఫున కృతజ్ఞతలు. జీ- 20 నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం చేపడతున్న చర్యలు అద్భుతం. ఈ సదస్సుకు దాదాపు 40 దేశాల నుంచి 200 మందికి పైగా ప్రతినిధులు హాజరుకానున్నారు. వారికి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. షీలానగర్ నుంచి ఎన్ఏడీ, తాటిచెట్లపాలెం, తెలుగుతల్లి ఫ్లైఓవర్ వరకు కోట్లాది రూపాయలతో సుందరీకరణ పనులతో పాటు రోడ్లు, విద్యుత్ అలంకరణ, ఆకర్షణీయమైన పెయింటింగ్ పనులు చేపట్టాం. సాగరతీరం కోస్టల్ బ్యాటరీ నుంచి రాడిసన్ హోటల్ వరకు విశాఖ తీర అందాలు అతిథులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాం. ఆర్.కె.బీచ్, సాగర్ నగర్, గుడ్లవానిపాలెం, సీతకొండ తదితర ప్రాంతాల్లో వ్యూ పాయింట్లను అతిథులు మెచ్చే విధంగా ఆకర్షణీయంగా రూపొందించాం. ప్రాంతాలు తెలిపే సూచిక బోర్డుల ఏర్పాటు, వేలాడుతున్న కేబుల్ వైర్లను తొలగించాం. వ్యర్థాలు ఎక్కడా లేకుండా అన్ని చర్యలు చేపట్టాం. దేశ ఔన్నత్యాన్ని చాటే విధంగా పలు ప్రాంతాలను తీర్చిదిద్దాం'అని మేయర్ వివరించారు.

ప్రజల భాగస్వామ్యం కావాలి

'జీ-20 సదస్సు విశాఖకే తలమానికం. విశాఖ నగర పౌరులుగా గొప్ప కార్యక్రమంలో భాగస్వాములవుదాం. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా పరిశుభ్రంగా ఉంచుదాం. దేశ విదేశీ ప్రతినిధులకు మన సంస్కృతి, సంప్రదాయాలను చూపిద్దాం' అని మేయర్ పిలుపునిచ్చారు. ఈ సదస్సు ఉద్దేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆమె వివరించారు. 'యోగా ఆల్' పేరిట వైఎస్సార్ సెంట్రల్ పార్క్, వుడా పార్కులో యోగా తరగతులు నిర్వహించాం. 'మాక్ జీ-20 కాన్క్లేవ్'పేరిట బుధవారం విద్యార్థులతో సదస్సు చేపట్టాం. 24న సాగరతీర స్వచ్ఛత పేరిట బీచ్ క్లీనింగ్, 25న చిత్రలేఖనం పోటీలు, 26న వైజాగ్ సిటీ మారథాన్, వైజాగ్ కార్నివాల్ పేరిట థింసా, కోలాటం, వీర నాట్యం, కూచిపూడి వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశాం. 'ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ సమావేశానికి హాజరయ్యే ప్రతినిధులు ముడసర్లోవలోని సోలార్ ప్రాజెక్టు, కాపులుప్పాడలోని జిందాల్ రీసైక్లింగ్ ప్లాంట్, జీవీఎంసీలోని కమాండ్ కంట్రోల్ ఆపరేషన్, తాగునీటి ప్రాజెక్టు, కైలాసగిరి, ఆర్కేబీచ్ తదితర ప్రాంతాలను తిలకించనున్నారు' అని మేయర్ తెలిపారు.

కోట్లాది రూపాయలతో నగర సుందరీకరణ

'రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జీ-20 సదస్సుకు సంబంధించి కోట్లాది రూపాయలతో చేపట్టిన సుందరీకరణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. జోన్-1 పరిధిలో రూ.412.86 లక్షలతో 20 పనులు, జోన్-2 పరిధిలో రూ.1353.77 లక్షలతో 73 పనులు, జోన్-3 పరిధిలో 1371.62 లక్షలతో 59 పనులు, జోన్-4 పరిధిలో 1908.65 లక్షలతో 35 పనులు, జోన్-5 పరిధి-ఏలో 752.44 లక్షలతో 33 పనులు, బిలో రూ.169.91 లక్షలతో 11 పనులు, జోన్-8 పరిధిలో రూ.1908.89 లక్షలతో 27 అభివృద్ధి పనులు ప్రారంభించాం. ఇందులో దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి. విద్యుత్‌కు సంబంధించి రూ.1168.47 లక్షలతో 56 పనులు, మెకానికల్‌కు సంబంధించి 287.41 లక్షలతో 4 పనులు, పీడీ-1కి సంబంధించి రూ.932.25 లక్షలతో 12 పనులు, పీఎల్ అండ్ సీకి సంబంధించి రూ.878.99 లక్షలతో 53 పనులు జరుగుతున్నాయి. మొత్తంగా ఇప్పటి వరకు 70 శాతం పైబడి పనులు పూర్తయ్యాయి'అని మేయర్ వివరించారు.

నేడు జాబ్‌మేళా

ఎంవీపీకాలనీ: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఉపాధి కల్పన మిషన్ (సీడాప్), డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ జాబ్‌మేళా ద్వారా 10 కంపెనీల్లో 417 ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. హనీగ్రూప్, రిలయన్స్, అపోలో, మెడ్‌ప్లస్, మ్యాక్స్, రిలయన్స్ డిజిటల్స్, స్పెన్సర్, ఖజానా జువలరీస్, వరుణ్ మోటార్స్, రిలయన్స్ ఫుడ్‌ప్రింట్స్ కంపెనీల్లో ఖాళీల భర్తీకి కోసం నిర్వహించనున్న ఈ మేళా పెందుర్తిలోని జిల్లా సమైక్య భవన్‌లో ఉదయం 10 గంటలకు జరగనుంది. వివరాలకు 73867 13880 నంబర్‌లో సంప్రదించవచ్చు.

స్టీల్‌ప్లాంట్‌కు జాతీయ ఇస్పాత్ పురస్కార్

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు జాతీయ స్థాయి ఇస్పాత్ పురస్కార్ అవార్డు లభించింది. బుధవారం జాయింట్ కమిటీ ఆన్ సేఫ్టీ,హెల్త్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఇన్ స్టీల్ ఇండస్ట్రీ (జేసీఎస్ఎస్ఐ) ఆధ్వర్యంలో రాంచీలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్లాస్ట్‌ఫర్నేస్, రా మెటీరియల్ జోన్‌లకు ఈ అవార్డులు లభించాయి. అదే విధంగా కాంట్రాక్టు కార్మికుల పాల్గొన్న ప్రదేశాల్లో జీరో ఫేటల్ యాక్సిడెంట్ అవార్డును కూడా అందజేశారు. స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగం సీజీఎం ఎం.ఎస్.వి.కృష్ణయ్య, ఉక్కు కార్మిక నాయకులు మంత్రి రాజశేఖర్, జె.రామకృష్ణ, దొమ్మేటి అప్పారావు, కొమ్మినేని శ్రీనివాసరావులు ఈ అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఇన్‌చార్జ్ ఎ.కె.బాగ్చీలు ఉక్కు ఉద్యోగులను అభినందించారు.

11 సెంట్రల్ బ్యాంక్ బ్రాంచ్‌లు

- 27న డీసీసీబీ డైరెక్టర్‌గా అంకంరెడ్డి పార్వతి ప్రమాణ స్వీకారం
- మీడియాతో డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత

నాతవరం : ఉమ్మడి విశాఖపట్నం సెంట్రల్ బ్యాంకు వివిధ రుణాల కింద రూ.2 వేల కోట్లకు పైగా టర్నోవర్ సాధించిందని డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత వెల్లడించారు. డీసీసీబీ డైరెక్టర్‌గా నియమితులైన దివంగత నేత అంకంరెడ్డి జమీలు భార్య అంకంరెడ్డి పార్వతిని నాతవరంలో బుధవారం కలిసి, అభినందించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ డీసీసీబీ ద్వారా రైతులకు కావాల్సిన అన్ని రకాల రుణాలు అందిస్తున్నట్టు తెలిపారు. రైతుల అభీష్టం మేరకు రుణ లక్ష్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో మరో 11 సెంట్రల్ బ్యాంకు బ్రాంచ్‌లను త్వరలో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు వెల్లడించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే వీటిని ప్రారంభిస్తామన్నారు. దివంగత అంకంరెడ్డి జమీలు ఆశయం మేరకు నాతవరంలో కొత్తగా సెంట్రల్ బ్యాంక్ బ్రాంచి ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గతంలో కూడా ఆయన విజ్ఞప్తి మేరకు సెంట్రల్ బ్యాంక్ ఏటీఎం కేంద్రాన్ని నాతవరంలో ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కొత్త డైరెక్టర్‌గా నియమితులైన పార్వతి ఈ నెల 27న విశాఖపట్నంలో ప్రమాణస్వీకారం చేస్తారని తెలిపారు. అదే రోజు డీసీసీబీ పాలకవర్గ సమావేశం కూడా ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి దివంగత నేత జమీలు అందించిన సేవలను పార్టీ ఎప్పుడూ గుర్తుంచుకుని, ఆయన కుటుంబ సభ్యుల్ని గౌరవిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యురాలు కరక రేణుక, మాజీ సర్పంచ్ కామిరెడ్డి కిత్తయ్యనాయుడు, వెదురుపల్లి సర్పంచ్ కాళ్ల సత్యనారాయణ, వర్తక సంఘం అధ్యక్షుడు తూతిక నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిలిచిన సేవలు.. తప్పని అవస్థలు

స్తంభించిన బీఎస్ఎన్ఎల్ సిగ్నల్



సెల్ సిగ్నల్ కోసం కొండపైకి చేరిన గిరిజనులు

రాజవొమ్మంగి: ఇంటర్నెట్ సమస్య ఏజెన్సీ ప్రాంతాన్ని పట్టి పీడిస్తోంది. ముఖ్యంగా బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్, సెల్‌వన్ సేవలు వినియోగదారులను ఎంతో నిరుత్సాహపరుస్తున్నాయి. సెల్‌ఫోన్లు పనిచేయక, ఇంటర్నెట్ సేవలు తరచు మొరాయిస్తుండటంతో ఎంతో ముఖ్యమైన పనులు నిలిచిపోతున్నాయి. అత్యవసర సమయంలో 108 అంబులెన్స్‌కు కూడా సమాచారం ఇవ్వలేని పరిస్థితి వస్తుంది. రాజవొమ్మంగి మండల వ్యాప్తంగా సుమారు వారం రోజులుగా బీఎస్ఎన్ఎల్ సేవలు తరచు మొరాయిస్తుండడంతో సమాచార వ్యవస్థ పూర్తిగా కుంటుపడింది. మన్య ప్రాంతంలో ప్రత్యామ్నాయ నెట్‌వర్క్ అయిన జియో సేవలు కూడా అంతంత మాత్రంగానే పనిచేస్తున్నాయి. నెట్‌వర్క్‌లు పనిచేయకపోవడంతో గిరిజనులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు, ఆయా సంస్థల సిబ్బంది సైతం తమకేం పట్టనట్లు వ్యవహరిస్తు ప్రజల సహనానికి పరీక్ష పెడుతున్నారు. ఇంటర్నెట్ లేకపోవడంతో బ్యాంకుల్లో సేవలు నిలిచిపోతున్నాయి. మరోవైపు సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తుల అప్‌లోడింగ్ జరగక పెండింగ్‌లో పడుతున్నాయి. అభ్యర్థులు ఆధార్‌అప్‌డేట్, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు సైతం పొందలేకపోతున్నారు. ఈ-సేవలో సేవలు నిలిచిపోతున్నాయి.వర్క్‌ఫ్రం హోం పద్ధతిలో ఏజెన్సీ వ్యాప్తంగా గల అనేక మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఇంటర్నెట్ పనిచేయకపోవడంతో వారి ఉద్యోగ భద్రతకే ముప్పు ఏర్పడింది. దేశ విదేశాల్లో గల కంపెనీలతో నిత్యం, మీటింగ్‌లు, వర్చువల్ విధానంలో సమావేశాలలో పాల్గొనలేక సతమతమవుతున్నారు. ఇప్పటికైనా బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

కొయ్యూరు: మండలంలోని బీఎస్ఎన్ఎల్ సేవలు తరచూ మొరాయిస్తున్నాయి. రోజూ ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలుగుతుంది. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా తోటలూరు నుంచి కాకరపాడు జరుగుతున్న పనుల్లో భాగంగా అండర్ గ్రౌండ్ కేబుళ్లు దెబ్బతినడంతో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయని పలువురు చెబుతున్నారు. బీఎస్ఎన్ఎల్ సేవలు స్తంభించడంతో బ్యాంకుతో పాటు తపాలా కార్యాలయాల్లో ఆన్‌లైన్ సేవలు నిలిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

అరకులోయ రూరల్: మండలంలో వారం రోజుల నుంచి బీఎస్ఎన్ఎల్ సేవలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ఆదివాసీ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు చట్టు మోహన్ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ సేవలు సక్రమంగా లేక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. నిత్యం సెల్ సిగ్నల్ అంతరాయంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నరన్నారు.ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సెల్ సిగ్నల్ అంతరాయం కలగకుండా చూడాలని ఆయన కోరారు.

ముగిసిన ఉమ్మడి ఏపీ ద్వితీయ ఆహ్వాన నాటిక పోటీలు



కొత్తపరిమళం నాటికలో సరిహద్దులో ఆర్మీ సైనికులు

అనకాపల్లి టౌన్: స్థానిక వి.వి.రమణ రైతుభారతి ఓపెన్ ఆడిటోరియంలో జ్యోతిసరళ స్మారక కళా పరిషత్, 1975 ఎంహెచ్ స్కూల్ పూర్వవిద్యార్థుల సహకారంతో నిర్వహించిన ఉమ్మడి ఏపీ ద్వితీయ ఆహ్వాన నాటిక పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ పరిషత్ ఏర్పాటు ద్వారా కళాకారులకు జీవనోపాధి కల్పిస్తున్న కళా పరిషత్ కార్యదర్శి పి.సిహెచ్.నాయుడు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

ఆకట్టుకున్న 'కొత్తపరిమళం'

శ్రీకాకుళం జిల్లా బొరివంకకు చెందిన శార్వాణి గిరిజన సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శించిన కొత్త పరిమళం నాటిక ఆద్యంతం ఆలోచింపజేసింది. ఇండియా-పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతంలో యుద్ధ భయంతో ప్రజలు అల్లాడిపోతుంటే.. మరో పక్క మనుషుల్లో మానవత్వం మంటగలిసిపోతుంది. జాతి, మతద్వేషాలతో దేశాలు రగిలిపోతున్న నేపథ్యంలో వాటి మధ్య నలిగిపోతున్న సరిహద్దు ప్రజల జీవితాలను ఈ నాటికలో ఆవిష్కరించారు. ఈ నాటికకు కథ కార్తీకుల శ్రీనివాసరావు అందించగా కె.కె.ఎల్.స్వామి దర్శకత్వం వహించారు. పిరియా చలపతి, శోభన్‌బాబు, చలం తదితరులు తన నటనతో నాటకాన్ని రక్తికట్టించారు.

ఉత్కంఠభరితంగా 'పక్కింటి మొగుడు'

పండు క్రియేషన్స్ కొప్పోలు వారిచే ప్రదర్శించిన పక్కింటి మొగుడు నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. భార్యాభర్తల సఖ్యతగా ఉంటేనే తన ఆస్తి మనుమలకు దక్కుతుందంటూ ఓ తాతా, బామ్మ వీలునామాలో చూపిన రూ.2 కోట్ల ఆస్తిని వారికి వ్వడానికి ఓ లాయర్ వస్తాడు. అప్పటి నుంచి జరిగిన సన్నివేశాలు చాలా ఆసక్తిగా సాగాయి.

గంజాయి కేసులో ఆరుగురు పట్టివేత

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలో నెల్లూరుకు చెందిన యువకుల వద్ద గంజాయికి సంబంధించిన కేసులో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. వీరు అనకాపల్లి ఫ్లై ఓవర్ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్టు సమాచారం ఉందని ఆయన తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

అఘోరాల ముసుగులో హల్‌చల్

నర్సీపట్నం: అఘోరాల ముసుగులో పలువురు నర్సీపట్నంలో హల్‌చల్ చేశారు. ఆరు నెలల క్రితం ఇదే విధంగా అఘోరాల మంటూ సన్యాసులు మద్యం సేవించి పట్టణంలో వీరంగం సృష్టించి, ప్రజలను భయాందోళనకు గురి చేశారు. ఉగాది పండగ రోజున మరోసారి తప్పతాగి ఒంటి మీద బట్టలు లేకుండా అఘోరాల మంటూ పట్టణంలో మరోసారి హల్‌చల్ చేశారు. మెయిన్‌రోడ్డుపై వెళ్లే వాహనాలను అడ్డగించి వాహనదారుల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేశారు. డబ్బులు ఇవ్వని వాహనాలను కదలనివ్వలేదు. వారి వికృత చేష్టలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

గాయపడిన మహిళ మృతి

అనకాపల్లిటౌన్: విశాఖకు చెందిన వంగలపూడి మంగవేణి(57) ఈనెల 15న తమ కుమార్తె ఫంక్షన్ నిమిత్తం విశాఖ నుంచి కొంకోటకు బి.కిరణ్ ద్విచక్రవాహనంపై వెళుతుండగా కొప్పాక జంక్షన్ వద్ద బైక్ నుంచి జారి పడిపోయింది. ప్రమాదంలో మంగవేణి తలకు తీవ్రగాయం కావడంతో అనకాపల్లి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు మృతుని కుమారుడు సాయిరమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ హెచ్‌సీ రాజు చెప్పారు.

అపురూప కళాఖండాల వేదిక

ఏయూక్యాంపస్: అపురూప, అరుదైన వస్తువుల వేదికగా జస్ట్ జడ్జ్ నిలుస్తుందని సంస్థ నిర్వాహకురాలు మౌనిక అన్నారు. పెదవాల్తేరు జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జస్ట్ జడ్జ్ ఆర్టిస్టిక్స్, లైఫ్ స్టైల్ షోరూంను బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దశాబ్దాల కిందట వినియోగించిన అపురూప వస్తువులను ఎంతో వ్యయప్రయాసలకోర్చి సేకరించినట్లు చెప్పారు. వీటిని కళాత్మక దృష్టితో చూసేవారికి, ఇష్టపడే వారికి విక్రయిస్తామన్నారు. చరిత్రకు సాక్ష్యాలుగా ఈ కళారూపాలు నిలుస్తాయన్నారు. ప్రాచీన కాలంలో వినియోగించిన చెక్క వస్తువులు, అలంకరణ వస్తువులు, ఇత్తడి కళారూపాలు వంటివి ఇక్కడ అందుబాటులో ఉన్నాయని చెప్పారు.



టేబుల్‌గా రూపొందించిన పాత వాహనం

'లెక్క'కు మించిన సాహిత్య మక్కువ

సంకలనం, వ్యవకలనం, గుణకారం, భాగహారం నేర్పే ఆ ఉపాధ్యాయుడు కవితా సంకలనాలు వెలువరిస్తున్నారు. లెక్కల ఉపాధ్యాయుడే అయినా తెలుగు భాషపై మక్కువతో రచనలు కొనసాగిస్తున్నారు. అమృతం లాంటి కవిత్వాన్ని వెలువరిస్తూ సార్థకనామధేయుడిగా పేరు తెచ్చుకుంటున్నారు ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న జుంజూరి అమృతరావు.. వృత్తి రీత్యా లెక్కలు బోధిస్తున్నా... ప్రవృత్తి రీత్యా సాహిత్య రంగంలో కృషి చేస్తూ మన్ననలు పొందుతున్నారు.



రాజశ్రీ అవార్డును ప్రభుత్వ విప్ బూడి చేతుల మీదుగా అందుకుంటున్న అమృతరావు

- రచనా వ్యాసాంగంతో పాటు విరివిగా సేవా కార్యక్రమాలు
- ప్రశంసలు అందుకుంటున్న
- గణిత ఉపాధ్యాయుడు అమృతరావు

కె.కోటపాడు : ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న జుంజూరి అమృతరావు చిన్నప్పటి నుంచే సాహిత్యంపై ఉన్న మక్కువతో రచనలు చేస్తూ అవార్డులు, ప్రతిభా పురస్కారాలను పొందుతున్నారు.

తెలుగు మాస్టారు స్ఫూర్తితో..

పెదబయలు రెసిడెన్షియల్ పాఠశాలలో చదివిన అమృతరావును అక్కడి తెలుగు మాస్టారు డాక్టరు మురళీకృష్ణ ప్రసంగాలు, ఆయన కవితలు ఆకర్షించాయి. దీంతో అప్పటి నుంచి తెలుగు భాష, సాహిత్యంపై ఆసక్తి చూపిన అమృతరావు రచనలు కొనసాగిస్తున్నారు.

సేవా కార్యక్రమాలు

ఉపాధ్యాయ వృత్తిలో ఉంటున్నా అమృతరావు సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ పలువురి మన్నలను పొందుతున్నారు. పేద విద్యార్థులకు అవసరమైన ఆర్థికసాయాన్ని అందిస్తున్నారు. కరోనా సమయంలో పోలీసులు, వైద్య సిబ్బందితో పాటు పాదచారులకు భోజనాలు, మంచినీరు, కూరగాయలను తన సొంత నిధులతో సమకూర్చారు.

ప్రశంసలు, పురస్కారాలు

- స్విట్జర్లాండ్, జెనీవాకు చెందిన ఇనిస్టిమెంట్ ఆఫ్ పీస్ సంస్థ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.
- 108 వచన కవితలను రాసి 2021లో మంచిర్యాలకు చెందిన అఖిల భారత సాహిత్య పరిషత్ నిర్వహించిన వచన కవితల పోటీల్లో ప్రత్యేక ప్రశంసతోపాటు రాజశ్రీ బిరుదు పొందారు. ఈ ప్రశంసా పత్రాన్ని ఎ.కోడూరు పాఠశాలలో ప్రస్తుత డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చేతుల మీదుగా అమృతరావు అందుకున్నారు.
- అఖిల భారత సాహిత్య పరిషత్ వారు విజయదశమిపై నిర్వహించిన కార్యక్రమంలో ద్వితీయ స్థానం లభించింది.
- నెల్లూరుకు చెందిన గోవిందరాజులు సీతాదేవి సాహిత్య వేదిక నిర్వహించిన కవితా పోటీల్లో ప్రథమస్థానం లభించింది.
- హైదరాబాద్ ఉస్మానియా తెలుగు రచయితల సంఘం వారు గుర్రం జాషువాపై నిర్వహించిన కవితల పోటీల్లో, రాజమండ్రిలో గోదావరి రచయితల సంఘం వారు అంతర్జాతీయ తపాలా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కవితా పోటీల్లో ప్రశంసలు పొందారు.
- అమృతరావు రాసిన కవితలు బుక్ ఆఫ్ థండర్-20 పుస్తకంలోను, గాంధీ జయంతి కవితా సంకలనంలో చోటు దక్కించుకున్నాయి.
- సమాజ సేవలో ఉన్న కవులకు, రచయితలకు విశాఖపట్నంలో ఈ ఏడాది ఆదరణ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఇచ్చిన అవార్డుల ప్రదానోత్సవంలో అమృతరావుకు విశిష్ట సేవారత్న పురస్కారం లభించింది.



కరోనా లాక్‌డౌన్ సమయంలో పోలీసులకు ఆహారం, తాగునీటిని అందిస్తున్న అమృతరావు

చిన్నప్పటి నుంచి ఆసక్తి



విద్యార్థి దశ నుంచి తెలుగు సాహిత్యంపై మక్కువ ఏర్పడింది. తెలుగు ఉపాధ్యాయుడు మురళీకృష్ణ స్ఫూర్తితోనే కవితలపై ఇష్టం పెరిగింది. గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నా ఖాళీ సమయాల్లో కవితలు రాయడం అవాటుగా మారింది.

–జుంజూరి అమృతరావు, ఉపాధ్యాయుడు, ఎ.కోడూరు.